సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

జగన్‌తోనే అందరికీ న్యాయం 'ఉత్తర' సిద్ధం

- సంక్షేమ పాలనను దీవించండి
- వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- ఎన్నికల ప్రచారంలో అడుగడుగునా ఆదరణ


కరపత్రం అందిస్తున్న కె.కె.రాజు, బర్కత్ అలీ


53వ వార్డులో ప్రజలను పలకరిస్తూ ఎన్నికల ప్రచారం చేస్తున్న కె.కె.రాజు

మద్రిపాలెం: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును ప్రజలు అడుగడుగునా ఆదరించారు. 53వ వార్డులో కార్పొరేటర్ బర్కత్ అలీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం డప్పులు, కోలాటాల మధ్య ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా కరాస వద్ద శ్రీదుర్గాలమ్మ, బంగారమ్మ అమ్మవార్లను దర్శించుకుని అక్కడ నుంచి ప్రచారం మొదలుపెట్టారు. శివనగర్, భాస్కర్ గార్డెన్స్, రాణాప్రతాప్‌నగర్, ఎఫ్‌సీఐ పార్కు, గ్రీన్ గార్డెన్స్, హుస్సేన్‌నగర్, శ్రీనివాస స్ట్రీట్, మసీదు వీధి, పార్వతీనగర్, నరేంద్రనగర్, శ్రీరాంనగర్, తదితర ప్రాంతాల్లో ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రచారం కొనసాగించారు. ఎక్కడికక్కడ మహిళలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని వారికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనం గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. అందుకే ప్రతి వార్డులో విశేష స్పందన, ఆదరణ లభిస్తున్నాయని చెప్పారు. కులమతాలకు అతీతంగా అర్హులందరికీ న్యాయం చేసిందే సీఎం జగనే అన్నారు. ప్రజలు తనను దీవించి, ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు జి.వి.రవిరాజు, జేసీఎస్ కన్వీనర్ అమర్‌రెడ్డి, 53వ వార్డు నాయకులు, మహిళలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

'ఫ్యాన్'కు ఓటేయాలని విస్తృత ప్రచారం

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజులను అఖండ మెజారిటీతో గెలిపించుకోవాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ పిలుపునిచ్చారు. 46వ వార్డు కైలాసపురం, కస్తూరినగర్, శాంతినగర్ కొండవాలు ప్రాంతాల్లో శనివారం ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా సీఎం అందించిన సంక్షేమ పాలనను వివరించి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

భారీ మెజారిటీతో గెలిపించండి

కంచరపాలెం పరిధి రెడ్డికంచరపాలెం, జాషువానగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో 54, 55వ వార్డుల ఎన్నికల పరిశీలకుడు బాకీ శ్యామ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో కార్పొరేటర్ కె.వి.ఎన్.శశికళ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి సీఎం వైఎస్ జగన్ బలపరిచిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు బొత్స ఝాన్సీ, కె.కె.రాజులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.


46వ వార్డులో నివాసులను ఓటు అభ్యర్థిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

సంక్షేమాన్ని చూసి ఓటేయండి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం సంతోషిమాత కాలనీ, చిట్టిబాబు కాలనీల్లో శనివారం డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ ప్రభుత్వానికి ఓటేయాలన్నారు. ఎన్నికల్లో బొత్స ఝాన్సీ, కె.కె.రాజులను గెలిపించాలని కోరారు. పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, ప్రవీణ్‌రాజు, ఇతర నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, బూత్ కన్వీనర్లు, మహిళలు పాల్గొన్నారు.


అశోక్‌నగర్‌లో కరపత్రం అందిస్తున్న శశికళ, బాకీ శ్యామ్‌కుమార్‌రెడ్డి


సంతోషిమాత కాలనీలో ప్రచారం చేస్తున్న కంపా హనోకు, పైడి రమణ, పార్టీ నాయకులు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

- సీఎం జగన్ బస్సు యాత్రను జయప్రదం చేయాలని కె.కె.రాజు పిలుపు

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఆదివారం నగరంలోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పిలుపునిచ్చారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఉత్తర పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మేనిఫెస్టోను ఒక పవిత్ర గ్రంథంలా భావించి ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన వైఎస్ జగన్ మరోసారి ప్రజల్లో మమేకమవడానికి ఇడుపులపాయ నుంచి శ్రీకాకుళం వరకు మేమంతా సిద్ధం పేరుతో బస్సు యాత్రకు శ్రీకారం చుట్టారని తెలిపారు. బస్సు యాత్ర విజయవంతంగా జరుగుతోందని, ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. ఆదివారం మధ్యాహ్నం 4 గంటల సమయంలో ఉత్తర నియోజకవర్గంలోకి ప్రవేశించనున్న బస్సు యాత్రను అందరూ జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, స్టాండింగ్ కమిటీ మెంబర్ కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు సారిపల్లి గోవింద్, పి.ఉషశ్రీ, రెయ్యి వెంకటరమణ, వి.ప్రసాద్, బర్కత్ అలీ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులతో సమావేశం

సీఎం వైఎస్ జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి దేశానికి ఆదర్శంగా నిలిచారని, వాటి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని కె.కె.రాజు అన్నారు. పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విశాఖను పరిపాలన రాజధానిగా చేసి ఉత్తరాంధ్రను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి జగన్ కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. సీఎం జగన్ మేమంతా సిద్ధం బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరారు. వీకే పీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, అల్లు శంకరరావు, సీనియర్ నాయకులు రవిరాజ్, బొగ్గు శ్రీను, స్టాండింగ్ కమిటీ మెంబర్ చల్లా రజని, కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, సారిపల్లి గోవింద్, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరావు, బర్కత్ అలీ, శశికళ, కో–ఆప్షన్ మెంబర్ సేనాపతి అప్పారావు, జేసీఎస్ మండల కో–ఆర్డినేటర్ భగతి విజయ్, పామేటి బాబ్జీ, జి.వి.రమణి, వార్డు అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి, పైడి రమణ, జేసీఎస్ కన్వీనర్ కర్రి మురళీకృష్ణరెడ్డి, నీలి రవి, వసంతల అప్పారావు, అమర్‌రెడ్డి, రాయుడు శ్రీను, నూకరాజు, పాండవశ్రీను, రమేష్, ఎస్.రవికుమార్, ఐ.రవికుమార్, సురేష్, బి.కిరణ్, గుడ్ల అశోక్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణలో మహిళలకు ఉచిత శిక్షణ

సీతంపేట: పీవీజీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత సెల్ఫ్ డిఫెన్స్ క్లాసులు నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ డైరెక్టర్ వెంకట్ పోలిశెట్టి తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. 5 ఏళ్ల చిన్నారుల నుంచి 30 ఏళ్ల లోపు వయసు గల మహిళలకు ఉచిత శిక్షణకు హాజరు కావచ్చని చెప్పారు. వైఎంసీఏ ఎదురుగా ఉన్న బీచ్ వద్ద, గోపాలపట్నం ఉన్నత పాఠశాల, భీమిలి బీచ్ వద్ద వచ్చే నెల 10 నుంచి వారంలో ఒక రోజు తరగతులు జరుగుతాయన్నారు. పి.ఎస్.ఆర్ అకాడమీ ఏపీ రాష్ట్ర ఇన్‌చార్జి పి.నరసింహరావు మాట్లాడుతూ 1980 నుంచి మార్షల్ ఆర్ట్స్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. తద్వారా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. మార్షల్ ఆర్ట్స్ ప్రధాన శిక్షకుడు శివరామకృష్ణ మాట్లాడుతూ ఆరు నెలలు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందితే ఆత్మవిశ్వాసం, చైతన్యం, ధైర్యం పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో చైతన్య, ఏలియన్స్ కళాశాల డైరెక్టర్ సతీష్ కొల్ల, ఏపీ హెడ్ మిల్టాన్ శాస్త్రి, వి.పూజారి, విశాఖ అధ్యక్షుడు కె.కె.రాజు, కార్యదర్శి ప్రవీణ్, జి.శివరామకృష్ణ, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వెంకట్ పోలిశెట్టి

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మురళీనగర్: మద్రిపాలెం విద్యుత్ సెక్షన్ మద్రిపాలెం 11 కేవీ ఫీడర్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా ఆదివారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మహారాణి వీధి, మద్రిపాలెం మెయిన్ రోడ్డు, రైల్వే క్వార్టర్లు, గవర వీధి, గొల్ల వీధి, రాణాప్రతాప్‌నగర్, శ్రీనివాసనగర్, హుస్సేన్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు గమనించాలని ఈఈ కోరారు.

ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో కార్తికేయ శరవణ ట్రస్టు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దేవాల రాజుకృష్ణ ఆధ్వర్యంలో శనివారం చైత్ర పూర్ణిమ ఉత్సవాలు, స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శర్మ కలశ స్థాపన, విఘ్నేశ్వర పూజ, మండపారాధన, అభిషేకాలు, వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ వేడుక శాస్త్రోక్తంగా జరిపారు. పలు రకాల పూలతో స్వామిని అలంకరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చొక్కాకుల కుమారి, కడగల జ్యోతిష్, కార్యదర్శి కాండ్రేగుల రాము, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కర్ణాటక సంగీతంలో శిక్షణకు దరఖాస్తులు

సీతంపేట: కర్ణాటక సంగీతంలో ఉచితంగా శిక్షణకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంగీత జనకులం అధ్యక్షుడు ఇంద్రగంటి కాశీప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గాత్ర, వాయిద్య, వేద అభ్యాసంలో శిక్షణ పొందడానికి విద్యార్థులు పూర్తి చేసిన దరఖాస్తులతో ఈ నెల 28వ తేదీ ఉదయం 6.30 నుంచి 9 గంటల వరకు తాటిచెట్లపాలెం ఇ.కె.సంస్కృతి సదన్‌లో జరగనున్న ఎంపిక కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. ఆసక్తి గల వారు వివరాల కోసం 93983 14502 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

'బస్సు యాత్ర' ట్రయల్ రన్

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఆదివారం సాయంత్రం ఉత్తర నియోజకవర్గంలోకి ప్రవేశించనున్న నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం బస్సు ట్రయల్ రన్ చేశారు. అక్కయ్యపాలెం హైవే మీదుగా సత్యం జంక్షన్ వరకు బస్సుపై వచ్చారు. అక్కడి నుంచి నేరుగా వెంకోజీపాలెం వరకు ట్రయల్ వేశారు. ముందుగా నక్కవానిపాలెం 60 ఫీట్ రోడ్డు నుంచి మళ్ల విజయప్రసాద్ ఇంటి వరకు వెళ్లి అదే మార్గంలో వెంకోజీపాలెం వరకు వెళ్లేందుకు ప్రయత్నించారు. చిన్న రోడ్డు, విద్యుత్ వైర్లు, చెట్లు అడ్డుగా ఉండటంతో నేరుగా హైవేలో వెంకోజీపాలెం వరకు బస్సు ట్రయల్ రన్ చేశారు.


సత్యం జంక్షన్ వద్ద జాతీయ రహదారిలో నిర్వహిస్తున్న బస్సు ట్రయల్ రన్

మూడో రోజు నాలుగు నామినేషన్లు

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గ అసెంబ్లీ స్థానాలకు మూడో రోజు శనివారం నాలుగు నామినేషన్లు దాఖలు చేశారు. నవ భారత నిర్మాణ సేవా పార్టీ నుంచి చింతాడ సూర్యం రెండు సెట్లు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి గొంప త్రివేణి, గొంప గోవింద్‌రాజు ఒక్కో సెట్, సమాజ్ వాదీ పార్టీ నుంచి గుంపుల శరత్‌బాబు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఉత్తర రిటర్నింగ్ ఆఫీసర్ డి.అఖిలకు అందజేశారు.

వైభవ వేంకటేశ్వరుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు స్వామికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బందారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

గైస్‌లో జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు

మురళీనగర్: కంచరపాలెంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్(గైస్)లో శనివారం జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫైర్ సేఫ్టీ కోర్సుల ప్రాధాన్యాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ప్రయోగాత్మకంగా వివరించారు. ఫైర్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ సేఫ్టీ, కెమికల్ సేఫ్టీ కోర్సుల విద్యార్థులు పాల్గొని ప్రయోగాలు చేశారు. కార్యక్రమంలో కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బి.వి. లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

టాపర్‌కు అభినందన


ఆరుద్ర మయూఖ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రమా ఆచంట

సీతంపేట: ఇటీవల విడుదలైన ఇంటర్ సెకండియర్ పరీక్షా ఫలితాల్లో హెచ్‌ఈసీ గ్రూపులో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన ఆరుద్ర మయూఖ్ భాగవతులను బీవీకే కళాశాల ప్రిన్సిపాల్ రమా ఆచంట అభినందించారు. ఈ సందర్భంగా శనివారం ద్వారకానగర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తమ కాలేజీలో చదివిన మయూఖ్ ఇంటర్ హెచ్‌ఈసీ గ్రూపులో 929 మార్కులు సాధించి కళాశాల అన్ని గ్రూపుల్లో టాపర్‌గా నిలిచాడని ప్రశంసించారు. కార్యక్రమంలో కళాశాల ఆర్ట్స్ విభాగం అధ్యాపకులు రత్నశేఖర్, భరత్, ప్రియా పట్నాయక్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


వ్యక్తి మృతదేహం

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఊర్వశి జంక్షన్ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో కార్లు నిలిపేచోట శనివారం ఉదయం 9 గంటల సమయంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. వ్యక్తికి సుమారు 40 ఏళ్ల వయస్సు ఉండొచ్చు. నీలం రంగు జీన్ ఫ్యాంట్ వేసుకున్నాడు. ఎండ తీవ్రతకు తట్టుకోలేక.. లేదా సరైన ఆహారం లేక మృతిచెంది ఉండవచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు. కంచరపాలెం సిద్ధార్థనగర్ వీఆర్వో ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఏఎస్ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేపట్టారు. వ్యక్తి మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడి సమాచారం తెలిసిన వారు సమాచారం అందించాలని కంచరపాలెం పోలీసులు కోరారు.


రైల్వే పోలీసుల అదుపులో గంజాయి రవాణాదారులు

- 28 కేజీల గంజాయి స్వాధీనం


గంజాయి, ఇద్దరు నిందితులతో జీఆర్పీ డీఎస్పీ, సీఐ, సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, 28 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. విశాఖ గవర్నమెంట్ రైల్వే పోలీసులు, వాల్తేర్ డివిజన్, రైల్వే భద్రతా దళం ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్‌ల ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్ఐ జి.శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ ఎస్ఐలు తమ సిబ్బందితో శనివారం విశాఖ రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన బిజా మహానందియా, సంతోస్ నాయక్ అనే ఇద్దరు వ్యక్తులు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వీరి వద్ద నుంచి రూ.1.4 లక్షల విలువైన 28 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విశాఖ మీదుగా ఢిల్లీకి అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు వారు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

స్టార్టప్‌లతో ఉపాధి అవకాశాలు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల విద్యార్థులకు స్టార్టప్ ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఏయూ ఆహబ్ సీఈవో రవి ఈశ్వరరావు మాట్లాడుతూ స్టార్టప్‌లతో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. ప్రముఖ ట్రైనర్ అనంతరామ్ ఘనాపాటి పాల్గొని స్టార్టప్‌లపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్ కో ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.

తూర్పు తీరంలో 'పూర్వీ లెహర్'



సింధియా: తూర్పు తీరంలో భారత నావికాదళం పూర్వీ లెహర్‌ను నిర్వహించింది. ఆపరేషన్ కంట్రోల్‌లో భాగంగా తూర్పు నావికాదళ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సముద్ర భద్రత సవాళ్లను ఎదుర్కొనేందుకు, భారత నావికాదళం సన్నద్ధతను అంచనా వేయడమే లక్ష్యంగా విన్యాసాలు జరిగాయి. కార్యక్రమంలో భారత నావికాదళానికి చెందిన నౌకలు, జలాంతర్గాములు, విమానాలు, ప్రత్యేక దళాలు పాల్గొన్నాయి.

